జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 23 | జనవరి | 2026 • పేజీలు : 8



## ఆదివాసీలకు అండగా పోలీస్ శాఖ: జిల్లా ఎస్పీ



**ఇల్లందు, జనవరి 22, ప్రజాజ్యోతి:** ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజు స్పష్టం చేశారు. గురువారం కొమరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏడ్పుల గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా

మిగతా 2 లో...

2 లో...





## ఇకపై ఆన్లైన్ ద్వారానే
# ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 'మన ఇసుక వాహనం' పైలట్ ప్రాజెక్ట్ అమలు
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పాల్వంచ కొత్తగూడెం కలెక్టరేట్ జనవరి 22 ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పూర్తిగా నియంత్రిత విధానంలో అమలు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్ మెంట్ సిస్టమ్ ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, అవినీతి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని, రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ విధానాన్ని ముందుగా పైలట్ ప్రాజెక్ట్ గా జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యం లో తెలంగాణ రాష్ట్ర గనులు ,భూగర్భ శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్

మిగతా 2 లో...




8 లో..

## అప్పుడు వాళ్లు... ఇప్పుడు వీళ్లు...
# లూటీ కోసం పోటీ

• నైనీ గని టెండర్ తో మళ్లీ తెరపైకి వచ్చిన సింగరేణి లూటీ చర్చ.. • ప్రభుత్వాలు మారినా లూటీ ఆట మారలేదన్న ఆరోపణలు • అవకాశాల గనిగా చెప్పిన నైనీ.. ఇప్పుడు వివాదాల గనిగా మారిందా..? • సైట్ విజిట్ సర్టిఫికేట్ తో మొదలైన టెండర్ గందరగోళం • వాటా లెక్కలు తేలకే.. బిడ్ ముందే రాజకీయాలు గడవలు అని ఆరోపణలు ? • రూ.665 కోట్లు ఖర్చయినా ఇంకా మొదలుకాని గని.. • బీఆర్ ఎస్ హయాంలో ధర పెంపు ఆరోపణలు.. ఇప్పుడు కొత్త అనుమానాలు • ఓబీ కాంట్రాక్టుల చుట్టూ రింగులా వ్యవహారం అన్న చర్చ.. • ప్రధానంగా సౌద సంస్థ అధినేత సృజన్ రెడ్డి పాత్ర పై ఆరోపణలు..? • నైని సింగరేణికి కల్పతరువా..? లేక నేతలకు లూటీ వేదికా..?

- జనం లేరు.. కానీ ధనం ఉంటే సరిపోద్దా?
- డబ్బు ఎరతో పదవుల కోసం వెంపర్లాట!
- గత ఆశను ఈసారి తీర్చుకునేందుకు తాపత్రయమా?
- జనం తీర్పు అవసరం లేదా!
- డబ్బుతో అన్ని కావనేది జగమెరిగిన సత్యం!



# జనం కన్నా... ధనమే మిన్ననా!

2 లో..

## మర్కోడు ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మిక తనిఖీ



**ఆళ్ళపల్లి, జనవరి22, ప్రజాజ్యోతి:** మర్కోడు విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హెచ్చరించారు. గురువారం ఆయన మర్కోడు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. మౌలిక వసతుల పరిశీలన పాఠశాల ప్రాంగణం, హాస్టల్ గదులు,

మిగతా 2 లో...

## మర్కోడు ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మిక తనిఖీ





(మొదటి పేజీ తరువాయి... )

మరుగుదొడ్లను పరిశీలించారు. నీటి సరఫరా సరిగ్గా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ, తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. భవన లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. డైనింగ్ హాల్, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన, పోషకాహారం అందించాలని.. వంట కోసం కట్టెలకు బదులు గ్యాస్ వాడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. కొత్త కిచెన్ షెడ్ కోసం నివేదికలు కోరారు. 3, 6, 8 తరగతుల విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని (చదవడం, రాయడం) స్వయంగా పరీక్షించారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, 10 రోజుల్లోగా పనులన్నీ పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. "విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు విషయంలో రాజీ పడకూడదు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి" అని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇకపై ఆన్లైన్ ద్వారానే ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా

(మొదటి పేజీ తరువాయి... )

అధికారులు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ వ్యవస్థ పని విధానం, ఇసుక బుకింగ్ విధానం, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపుల విధానం, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని , ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సహా అన్ని అవసరాల కోసం మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అనుమతి, ప్రతి రవాణా, ప్రతి లావాదేవీ పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరుగుతుందని, ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదని అన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్ కు అనుగుణంగా తక్షణమే ఇసుక లభ్యత ఉన్న రీచ్ లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన రీచ్ ల వివరాలు, రవాణా సామర్థ్యం, రోజువారీ సరఫరా వివరాలను సమగ్రంగా ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. తద్వారా ఇసుక కొరత లేకుండా ప్రజలకు సకాలంలో సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ కొత్త విధానం సమర్థవంతంగా అమలవ్వాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తాసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలు సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు ఈ వ్యవస్థపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని, ఫీల్డ్ స్థాయిలో కూడా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, ధరల పెంపు వంటి అంశాలపై కఠిన నియంత్రణ చర్యలు అమల్లోకి వస్తాయని హెచ్చరించారు. ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఏడి మైనింగ్ అధికారులు అధికారులు, పిఓ–టీజీఎండిసి, సి జి జి (హైదరాబాద్) ప్రతినిధులు, మండల స్థాయి తహసిల్దార్లు, ఎంపిడివోలు , తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

- జనం లేరు.. కానీ ధనం ఉంటే సరిపోద్దా?
- డబ్బు ఎరతో పదవుల కోసం వెంపర్లాట!
- గత ఆశను ఈసారి తీర్చుకునేందుకు తాపత్రయమా?
- జనం తీర్పు అవసరం లేదా!
- డబ్బుతో అన్ని కావనేది జగమేరిగిన సత్యం!



# జనం కన్నా... ధనమే మిన్నా!

**ఇల్లందు, జనవరి 22, ప్రజాజ్యోతి:** సాధారణంగా ఓ ప్రజాప్రతినిధిగా విజయం సాధించాలంటే ప్రధానంగా జనాలలో ఆదరణ తప్పనిసరి. కానీ ప్రస్తుత రాజకీయాల్లో కొందరు జనంతో పనిలేదంటూ, తన వద్ద దండిగా డబ్బులు ఉన్నాయని వాటిని ఎరగా చూపి ఓట్లను దండుకొని తాను గత కొన్ని ఏళ్ల నుండి ఆశపడుతున్న ఆ పదవిని అధిరోహించాలని తాపత్రయ పడుతున్నట్లు సమాచారం. జన బలం లేనిది.. డబ్బు బలం ఉంటే పదవులు సాధించడం చాలా వరకు కష్టమనే విషయం తెలిసో తెలియకో ఇలా వ్యవహరిస్తునట్లు ఇల్లందులో జోరుగా ప్రచారం జరుగుతుంది. అన్ని పనులు డబ్బుతో జరగవనేది వారికి తెలియకపోవడం గమనార్హం.

ఒక ప్రజా ప్రతినిధిగా గెలుపొందాలంటే ఆ ప్రాంతంలోని జనాల మనసులు ముందుగా గెలుచుకోవాలి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించాల్సి ఉంటుంది. వారి కష్ట, సుఖాల్లో చేదోడు వాదోడుగా ఉండాలి. కానీ ఓ నాయకుడు నాకు జనం లేకపోయినా పరవాలేదు ఆ జనాన్ని కొనుగోలు చేసే అంత ధనం నా దగ్గర ఉందని, ఎంతటి వారినైనా సరే నా దగ్గర ఉన్న ధనబలంతో కొనుగోలు చేసుకునే సత్తా ఉందది జనం లేని గణ నాయకుడి ధీమాలో ఉన్నట్లు సమాచారం. తాను, తన సతీమణి కళ్ళల్లో ఆనందం, చిరకాల కోరిక తీర్చాలని ఓ పతి పడుతున్న ఆరాటం ఈసారైనా నెరవేర్చుకోవాలని ఆత్రుత, ఆశ వర్ణనాతీతం. గతంలో రూ. కోట్లు కుమ్మరించి ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేసి చివరికి భంగపాటుకు గురైన ఆ వ్యక్తి ఈసారి వచ్చిన రిజర్వేషన్ తనకోసమే వచ్చిందని తానే తెప్పించుకున్నానని గప్పాలు కొడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎలాగైనా ఈ సారి ఆ సీట్లో కూర్చోవాలని ఆరాటపడుతున్నాడని ఆయన పడుతున్న ఆరాటన్ని చూస్తుంటే అర్థమవుతుంది. ఓటర్లను తన వద్ద ఉన్న నోట్ల కట్టలతో కోట్లు పెట్టి కొనుగోలు చేసుకునే సత్తా నాకుందని, నాకు ఇవ్వండి 24 వార్డుల్లోని సీట్లు, చైర్మన్ సీటు నోట్లు వెదజల్లి ఓట్లు కొనుగోలు చేసుకుని గెలిపించుకొని వస్తా.. అంటూ ఇల్లందులో కొందరికి రూ. కోట్ల ఆఫర్ ఇస్తున్నట్లు. ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా అన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఓట్ల బలం లేని ఈ నోట్ల కట్టల బలం ఉన్న వ్యక్తిని సమర్థిస్తారా అనేది తెలియాల్సి ఉంది.

**డబ్బు ఎరతో పదవులపై పాకులాట**

సదరు వ్యక్తికి తన వద్ద ఉన్న ఆర్థిక బలంతో పదవులపై మక్కువతో డబ్బులను పంచి తనకు కావలసిన పదవిని దక్కించేందుకు వెంపర్లాడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. తనకు జనంతో పనిలేదని.. తను వద్ద ఉన్న ధనం వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఓ పార్టీలో గెలిచి ఆ ప్రధాన సీటు కోసం తీవ్ర ప్రయత్నాలు చేయడంతో పాటు రూ. కోట్లు ఖర్చు చేసిన కానీ తాను అనుకున్న కళ నెరవేరకపోవడం వల్ల ఈ సారి ఎలాగైనా సాధించాలని ఆశతో ఉన్నట్లు తెలుస్తుంది.

ఏది ఏమైనా గత కొన్ని ఏళ్ల నుండి పార్టీని నమ్ముకోని ఉన్న వారిని కాదని అవకాశవాద రాజకీయాలతో పదవులను సాధించాలనుకునే వారికి ప్రాధాన్యత ఇస్తారా అనేది తెలియాలంటే వేచి ఉండాల్సిందే.

## ఆదివాసీలకు అండగా పోలీస్ శాఖ: జిల్లా ఎస్పీ

(మొదటి పేజీ తరువాయి... )

పోలీస్ శాఖ పని చేస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత, పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్స్, పోక్సో కేసుల గురించి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిత్యం హెల్మెట్ ధరించి మాత్రమే ద్విచక్ర వాహనాలను నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. అనంతరం ఎస్పీ చేతుల మీదుగా అక్కడ నివసించే 100 కుటుంబాలకు హెల్మెట్లు, దుప్పట్లు, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అదేవిదంగా గ్రామంలోని యువతకు ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంటును ఎస్పీ ప్రారంభించారు. అనంతరం కొమరారం పోలీస్ స్టేషన్ ను సందర్శించి



అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ విధులలో ఉండే అధికారులు, సిబ్బంది కొరకు నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ క్వార్టర్స్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ ఎన్. చంద్రభాను, ఇల్లందు, టేకులపల్లి, గుండాల సీఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, తిరుపతి, ఎస్సైలు రాజేందర్, రవూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించండి
- సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు





**ఇల్లందు, జనవరి 22, ప్రజాజ్యోతి:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో మాజీ కౌన్సిలర్ శనిగారపు శృతి – రమేష్ దంపతులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి ఆదరించాలని కోరారు. ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వంలో ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం మాటలు, హామీలు చెప్పడం తప్ప అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వంలో లేని పార్టీని మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని ప్రచారం చేయడం విడ్డురంగా ఉందని, మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వం వైపే ఉన్నారని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓట్లు వేసి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీ టికెట్ ఆశించే వారిలో ఎవరికీ టికెట్ వచ్చిన అందరు సమిష్టిగా కష్టపడి గెలిపించుకోవాలని సూచించారు. పార్టీ నిర్ణయం మేరకే ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. అనంతరం 24, 3 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మాజీ మున్సిపల్ చైర్మన్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్ళపల్లి అనసూయ, మాజీ వైస్ చైర్మన్ పులిగళ్ల మాధవరావు, సీనియర్ నాయకులు కోరం సురేందర్, మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, మండల రాము, స్వరూప, కమలమ్మ, కాకటి భార్గవ్, బండి ఆనంద్, శివ, శంకర్, సర్పంచులు పాయం స్వాతి, వల్లాల మంగమ్మ, దనసరి స్రవంతి, బానోత్ శారదా, గుగులోత్ నాగార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజపురంలో 'టీబీ ముక్త భారత్' వైద్య శిబిరం

- మొబైల్ ఎక్స్‌రే ద్వారా 96 మందికి స్క్రీనింగ్.. 12 మంది అనుమానిత కేసులు గుర్తింపు



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 22,ప్రజాజ్యోతి:** దేశాన్ని క్షయ రహితంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలం రాజపురం–నరసాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ ఉపసర్పంచ్ నరసారెడ్డి ప్రారంభించారు.ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా అత్యాధునిక మొబైల్ ఎక్స్‌రే వాహనం ద్వారా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 96 మందికి ఎక్స్‌రే పరీక్షలు చేయగా, అందులో 12 మందిని ప్రాథమికంగా టీబీ అనుమానితులుగా గుర్తించినట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు.టీబీ లక్షణాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, దగ్గినప్పుడు కఫంలో రక్తం రావడం లేదా ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అనుమానితులకు కఫం, రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వపరంగా ఉచిత చికిత్స, మందులు అందజేస్తామని తెలిపారు. అలాగే నిక్షయ్ పోర్టల్ ద్వారా రోగులకు పోషకాహారం కోసం ప్రతి నెల రూ.1000 ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు.ఈ శిబిరంలో వైద్య సిబ్బంది ఎస్తేర్ రాణి, జయలక్ష్మి, హెచ్ఎస్ ప్రకాశరావు, మొబైల్ ఎక్స్‌రే టెక్నీషియన్ సాయి కృష్ణ, ఏఎన్ఎంలు వాణి, పుష్పరాజ్యం, ఆశా కార్యకర్తలు రమాదేవి, స్వరూప, సుభద్ర, ఉమా పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన



**పాల్వంచ జనవరి 22 ప్రజా జ్యోతి:** పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రతి గురువారం మాదిరిగా 108 సువర్ణ పుష్పములతో వైభవముగా సువర్ణ పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు , ఇందులో భాగంగా అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించినారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీకుమారి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.అదేవిధంగా ఈ నెల 23 న శ్రీ పంచమి సందర్భంగా సామూహిక సరస్వతి పూజ కార్యక్రమాన్ని ఉదయం 10.30గం..లకు వైభవంగా అమ్మవారికి వంచామృతాభిషేకము , సామూహిక నరస్వతి వూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో తెలిపారు, అదేవిధంగా ఈ పూజా కార్యక్రమానికి 6 సంవత్సరములలోపు చిన్నారులను వారి తల్లితండ్రులు వెంట తీసుకొనివచ్చి అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు

## బహుజనుల కోసమే బహుజన చైతన్య యాత్ర



**ఇల్లందు టౌన్, జనవరి 22, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికలలో బహుజనుల గెలుపు కోసమే నేటి నుంచి 26వ తేదీ వరకు బహుజనుల చైతన్య యాత్రను చేపట్టనున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ తెలిపారు. గురువారం స్థానిక ఏక్తా హౌజ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న ప్రజల కోసం పోరాటం చేసే యువతను ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు బీసీ సంఘాల ఐక్యవేదిక ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. పార్టీలు, సామాజిక వర్గాలకు అతీతంగా ఏ పార్టీ నుండి పోటీ చేసిన వారు ఆయా వార్డు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, ప్రశ్నించేతత్వం కలిగి ఉన్న వారి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. సబండ వర్గాల సమైక్యత కోసం మూడు రోజుల పాటు పట్టణంలో విస్తృతంగా 24 వార్డుల్లో పర్యటించి పోటీలో ఉన్న ఆశావాహుల బలాబలాలను గుర్తించనున్నట్లు తెలిపారు. ఏది ఏమైనా అన్ని స్థానాల్లో జనరల్ స్థానాల్లో సైతం పోటీపడి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థుల గెలుపుతో పాటు రిజర్వేషన్లు కేటాయించబడిన స్థానాల్లో పోటీపడుతున్న ప్రజల కోసం వారి పక్షాన పోరాడే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. బహుజన చైతన్య యాత్రకు బహుజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, ఏక్తా హౌజ్ సభ్యులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ గట్టు శివాలయంపై నిర్లక్ష్యం

- శివరాత్రి వస్తున్నా పట్టించుకోని పాలకులు
- పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి : బీజేపీ డిమాండ్





**దమ్మపేట,జనవరి. 22(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం,గుర్రాయి గూడెం గ్రామ పరిధిలో ఉన్న దుర్గమ్మ గట్టుపై వెలసిన స్వ యంభూ శివాలయాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు తంబళ్ల రవి మాట్లాడుతూ... వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి లేకుండా ఉందని విమర్శించారు.గత ఏడాది ఉత్సవాల సమయంలో గుడిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆ మాటను విస్మరించారని అన్నారు. మరోసారి మహాశివరాత్రి సమీపిస్తున్నప్పటికీ ఆలయానికి వెళ్లే కనీస దారిని కూడా సరిచేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద బండరాళ్లు, కంప చెట్లు తొలగించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించి తక్షణమే ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు గూడ ముత్యాలరావు, కారం రత్నకుమారి, పల్లపు శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించిన టేకులపల్లి సర్పంచ్

**టేకులపల్లి,జనవరి22,ప్రజాజ్యోతి :** గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్ ఈజీఎస్) కింద చేపట్టిన పనులను టేకులపల్లి గ్రామ సర్పంచ్ బోడ బాలు నాయక్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో చేపట్టనున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్ బోడ బాలు నాయక్, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమని,ఈ పథకం ద్వారా గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.అలాగే పనులు నాణ్యతతో, పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, వార్డు సభ్యులు, గ్రామస్థులు, ఉపాధి హామీ సిబ్బంది, వివిధ గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధికి సర్పంచ్ తీసుకుంటున్న చర్యలను గ్రామస్తులు అభినందించారు.



## తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**పాల్వంచ: జనవరి 22 ప్రజా జ్యోతి:**తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 క్యాలెండర్‌ను భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ కె. రాఘవులు, కొత్తగూడెం డివిజన్ ఇన్‌చార్జ్ ప్రెసిడెంట్ కే. కోటేశ్వరరావు, సభ్యులు ఎస్. రాంబాబు, ఏ. ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ ఎసిఎంఓ

- పదవ తరగతిలో 100% ఫలితాలు సాధించాలి





**పాల్వంచ, జనవరి 22 ప్రజా జ్యోతి:** మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని పాఠశాలను ఐటిడిఎ భద్రాచలం ఏ సి ఎం ఓ (అకాడమిక్ మోనిటరింగ్ సెల్ అధికారి) కే రమేష్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు 100% ఫలితాలతో ఉత్తీర్ణులు కావాలని అన్నారు. జీవితంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నప్పుడే లక్ష్యాలను అందుకుంటామని తెలిపారు. ప్రాజెక్ట్ అధికారి గిరిజన విద్యార్థుల కోసం పదవ తరగతి తర్వాత ఏ కోర్సులు ఉంటాయో ఫ్లెక్స్ రూపంలో అందించిన కెరియర్ గైడెన్స్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు.అనంతరం విద్యార్థులకు రోజు వారి నిర్వహిస్తున్న స్లిప్ టెస్ట్ ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులందరూ సమిష్టితో 100% ఫలితాలు కోసం కృషియాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సబ్జెక్టు వారీగా రివ్యూ చేశారు. ఉద్దీపకం వర్క్ బుక్ విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని, అది విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎన్ చందు, స్టాఫ్ సెక్రటరీ ఎస్ బాలు, వార్డెన్ పోలేబోయిన వెంకటేశ్వర్లు, శంకర్, స్వరూప రాణి, పద్మావతమ్మ, ఇంగ్లీష్ బాలు, భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేగళ్ల, శేఖరం బంజర్ ఆరోగ్య కేంద్రాల తనిఖీ

- డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్





**పాల్వంచ ,జనవరి 22 ప్రజా జ్యోతి:** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ గురువారం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శేఖరం బంజర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రమదానం – సమిష్టి భోజనం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కేంద్ర పరిసరాల పరిశుభ్రత, వాడకం లేని పరికరాలను తొలగించిన విధానంపై సంతృప్తిని వ్యక్తం చేశారు.అదేవిధంగా శేఖరం బంజర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మీటింగ్ హాల్ నిర్వహణపై సమీక్ష నిర్వహించి, అక్కడ జరుగుతున్న పనితీరును నిశితంగా పరిశీలించారు.అనంతరం జిల్లా కార్యాలయంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి, జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.ఈ కార్యక్రమంలో డెమో నాగలక్ష్మి , డిపి ఎం ఓ మోహన్, డిపి యు సలితతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కూల్ విద్యార్థులకు ఎ రైవ్ ఎ లైవ్ అవగాహన - 2026

- స్కూల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ



**సుజాత నగర్ జనవరి 22 ప్రజా జ్యోతి:** మండలం లో రోడ్డు భద్రత ప్రోగ్రాంలో భాగంగా ఈరోజు సుజాతనగర్ హై స్కూల్ ను సందర్శించి ట్రాఫిక్ రూల్స్ గురించి పిల్లలకు అవేర్నెస్ చేయడం జరిగింది. ఇప్పటి వరకు మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేయటం కనిపిస్తుంది. మైనర్ డ్రైవింగ్ చేయటం వలన వాళ్లకి ఎటువంటి డ్రైవింగ్ మీద అవగాహన లేకపోవడం వలన కొన్ని కుటుంబాలు భాధ పడుతున్నాయి.మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరం. మైనర్లకు డ్రైవింగ్ చేయడానికి అనుమతి ఇచ్చిన వాహనాల యజమానులను కూడా చట్టరీత్యా శిక్షించడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలను, రోడ్డు భద్రతను పాటిస్తూ బాధ్యతగా ఉండాలని పిల్లలతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుజాత నగర్ ఎస్సై రమాదేవి తో పాటు సుజాత నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అయిన ఎ ఎస్సై రాఘవులు, హోంగార్డ్ లాజర్ మరియు సత్యనారాయణ పాల్గొనడం జరిగింది.

## మొండివర్రె లో ఆర్థిక అక్షరాస్యతా అవగాహన కార్యక్రమం

- డిజిటల్ మోసాలపై హెచ్చరిక... బ్యాంకింగ్ సేవలపై అవగాహన



**దమ్మపేట,జనవరి. 22(ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,దమ్మపేట మండలం, మొండివర్రె గ్రామంలో విలేజ్ లెవల్ ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా దమ్మపేట వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతా అవగాహన కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వి. రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వి. రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొని పొదుపు అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను సకాలంలో క్లెయిమ్ చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్, ఉపసర్పంచ్, వీఓఏలు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్పీ పాయింట్, టీజీబీ బీసీ పాయింట్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులపై స్పందించవద్దని సూచించారు.కార్యక్రమంలో ఇన్సూరెన్స్, పొదుపు పద్ధతులు, డిజిటల్ బ్యాంకింగ్, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ మనీ, ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్థుల నుంచి ఇన్సూరెన్స్ అప్లికేషన్లను సేకరించారు.

## భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ అరెస్ట్

- నేడు ఏసీబీ కోర్టులో హాజరు : డీఎస్పీ రమేష్



**భద్రాచలం, జనవరి 22 ,ప్రజాజ్యోతి :**భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ షేక్ ఖదీర్‌ను ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ గురువారం అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను ఏసీబీ కోర్టులో హాజరుపరచేందుకు తీసుకెళ్లారు.గత సంవత్సరం జూన్ నెలలో బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఖదీర్ పనిచేస్తున్న సమయంలో అనేక ఆర్థిక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి, పలు రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, భూ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.తదుపరి ఆయనను వరంగల్‌కు బదిలీ చేయగా, ఇటీవల మళ్లీ భద్రాచలం సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం ఏసీబీ అధికారుల బృందం భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని, బూర్గంపాడు కార్యాలయంలో జరిగిన అవకతవకలపై అంతర్గత విచారణ చేపట్టింది.విచారణ అనంతరం ఖదీర్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఏసీబీ న్యాయస్థానంలో ఆయన్ను హాజరుపరుస్తామని వెల్లడించారు.

## ఘనంగా పుస్తక ప్రదర్శన

- నిత్యజీవితంలో పుస్తక పఠనం ఎంతో ప్రాముఖ్యత





**టేకులపల్లి,జనవరి22,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం గోలియా తండలోని తాసిల్దార్ కార్యాలయం నందు గ్రంథాలయ శాఖ గ్రంథ పాలకుడు నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను గోలియా తండ సర్పంచ్ లకావత్ నాకా, డిసిసిబి బ్యాంకు మేనేజర్ శ్రావణిలు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గోలియా తండ సర్పంచ్ మాట్లాడుతూఎందరో మహానుభావుల త్యాగాలు ఈ గ్రంథాలయాలుగా వెలిశాయని,నిత్యజీవితంలో పుస్తకపఠనం ప్రాముఖ్యత నేటి యువతకు ఎంతో ఉపయోగపడుతుందని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ పాట మంచి కార్యక్రమం అని అన్నారు. విద్యార్థులు, ప్రజలు ప్రతి ఒక్కరు గ్రంథాలయ శాఖ సేవలను ఉపయోగించడం వల్ల మరెన్నో పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులోకి వారు తీసుకొస్తారని తెలిపారు. డిసిసిబి బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూవిజ్ఞాన నిలయాలు గ్రంథాలయాలు. వీటిలో గతంలో న్యూస్ పేపర్లు, మ్యాగజైన్స్, కథలు, నవలలు, చరిత్ర పుస్తకాలు చదివేందుకు ప్రజలు, యువకులు, కవులు, రచయితలు వచ్చేవారు. కానీ, ఇప్పుడు ట్రెండ్ మారింది. ప్రభుత్వం వెల్లడించే వివిధ నోటిఫికేషన్స్‌లో విజయం సాధించేలా ఉద్యోగార్థులను సిద్ధం చేసే వేదికలుగా మారుతున్నాయంటే ఆశ్చర్యపోవాల్సిందే. ప్రశాంతమైన వాతావరణంలో ఖర్చు లేకుండా పోటీ పరీక్షలతోపాటు ఇతర పుస్తకాలు,మ్యాగజైన్స్, దినపత్రికలు ఉచితంగా అందుబాటులో ఉండటంతో క్యూ కడుతున్నారు.జిహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పంచే భండాగారాలు గ్రంథాలయాలు ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దే సరస్వతీ నిలాయాలు. ఇక్కడ విజ్ఞానాన్ని పెంపొందింప జేసుకుని ఉన్నత శిఖరాలకు చేరిన వారెందరో ఉన్నారు. కంప్యూటర్ యుగంలో కూడా పుస్తక పఠనంపై యువత మొగ్గు చూపుతున్నారు. ఇంటర్నేట్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఏ విషయమైన నెట్‌లో సెర్చ్ చేస్తే సులువుగా దొరుకుతున్నది. కానీ పుస్తక పఠనంలో ఉన్న తృప్తి కంప్యూటర్ సెర్చింగ్‌లో లేదంటున్నా రు పాఠకులు. సాంకేతిక ఎంత పెరిగినా ఎన్నికంప్యూటర్లు వచ్చి నా గ్రంథాలయ ప్రత్యేకత కాదనలేదని దని అన్నారు. ఈ కార్యక్రమంలో సుఖాలబోడు సర్పంచ్ రామ,కాంగ్రెస్ మండలం అధ్యక్షులు దేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి!

- డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరిస్తాం.!
- ఆన్లైన్ గేమ్లు జోలికి వెళ్లకండి
- వాహనాలకు పత్రాలు తప్పనిసరి
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ - అలైవ్ ప్రోగ్రాం
- రోడ్డు భద్రత నియమాలను పాటించాలి
- ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రబాను





**టేకులపల్లి,జనవరి22, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మండల కేంద్రం లోని గోలియా తండ పంచాయతీ వాగ్గొడు తండాలో కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్ ) ని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు డిఎస్పి హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఆశచూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు.పోలీసులను ఫోన్ చేసాం మీ ఖాతా నెంబరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంది పోలీస్ శాఖ పరంగా మీకు సహాయం చేస్తామని తెలిపిన అటువంటి వాటిని నమ్మవద్దని మీకు అందుబాటులో ఉన్న బ్యాంకు వెళ్లాలని తెలిపారు.పోలీస్ శాఖకు బ్యాంకు ఖాతాల వివరాలు అవసరం లేదని తెలిపారు.మీకు పదే పదే ఫోన్ చేసి విసిగిస్తే మీ అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేయాలని తెలి పారు. మొబైల్ ఫోన్లకు అన్నోన్ నెంబర్ల నుంచి ఫోన్ చేసి బ్యాంకు లోన్లు ఇస్తామని నమ్మించడానికి చూసి మన దగ్గర అమౌంట్ లాక్కుంటారని, అటువంటి వాటిని ఎవరూ నమ్మొద్దని తెలిపారు.ప్రతిదీ కూడా సెల్ ఫోన్ తోనే లింక్ ఉండడంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డ్, ఆధార్ కార్డు, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి అన్ని విధాలుగా మన సెల్ ఫోన్ నెంబర్ అవసరం ఉంటుందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ –అలైవ్ అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ శాతం మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు.గంజాయి,మాదకద్రవ్యాలంపై టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుపోతుందని సిఐ బత్తుల సత్యనారాయణ అన్నారు.గ్రామాల్లో గంజాయి సాగుకు పాల్పడినా,రవాణా చేసినా ప్రభుత్వ సంక్షేమ పథకాలురద్దవుతాయన్నారు.మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమ వుతుందని,మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని వారు తెలిపారు.గంజాయి,ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్ళను చేయాలనే ఆశతో ఉంటే కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు అ న్నారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.యువత ఎక్కువ మంది మత్తుపానీయా లకు, మత్తు పదార్థాలకు బానిసలై రహదారి ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు వదులుకుంటు న్నారని, కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే యువతే కీలకమని అటువంటి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని సూచించారు. స్పెషల్ డాగ్స్ స్క్వాడ్ తో అనుమానం నోట్లు ప్రదేశాలను మొత్తాన్ని తనిఖీ నిర్వహించారు. గంజాయి రవాణా విక్రయాలు, గాంజాయిని వాడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, గంజాయితో పాటు, మత్తు కలిగించే కొన్ని గ్లాసులను అతికించే గమ్ము సైతం వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు సీఐ తెలిపారు. ఆన్లైన్ గేముల జోలికి వెళ్లొద్దు అని ఎస్ఐ ఆలకుంట రాజేందర్ అన్నారు.రాష్ట్రంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. పట్టణాల్లో కాకుండా పల్లెల్లోకి కూడా ఈ విషసంస్కృతి పాకుతోంది. నిర్వాహకులు దీని ద్వారా కోట్ల రూపాయలు సంపాదిస్తుంటే బెట్టింగ్ పెట్టిన వారు గంటల వ్యవధిలో వేల నుంచి లక్షల రూపాయలను నష్టపోతున్నారు. ఈ ఊబిలో చిక్కుకున్న మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళన కల్గిస్తోంది. బెట్టింగ్ వలలో ప్రధానంగా యువత చిక్కుకుంటోంది. చదువుకోవాల్సిన వయసులో బెట్టింగ్‌లు కాస్తూ వేల నుంచి లక్షల రూపాయలను పోగొట్టుకుంటున్నారు. ఈ వ్యసనం వదలలేక అప్పులు చేస్తున్నారు. రుణయాప్‌లను ఆశ్రయిస్తున్నారు. అప్పులు తిరిగి చెల్లించలేక ఆ ఒత్తిడిలో చదువులను గాలికి వదులుతున్నారు. అప్పుల ఒత్తిడి ఇంకా ఎక్కువైతే ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఇలా యువత ప్రాణాలు తీసే స్థాయికి బెట్టింగ్ మహమ్మారి విస్తరించడం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టి ఈ యొక్క బెట్టింగ్లకు పాల్పడకుండా చూడాలని, అలాగే ఆన్లైన్ గేమ్లు ద్వారా రమ్మీ, లూడో, పబ్జి ఇలాంటి అనేక ఆన్లైన్ గేమ్లు ఫోన్లలో ఆడి లక్ష నుంచి కోట్ల వరకు పోగొట్టుకుంటున్నారు అని ఎస్సై ఆలకుంట రాజేందర్ తెలిపారు.కార్డెన్ అండ్ సెర్చ్ లో 35 ద్విచక్ర వాహనాలను, 1 ఆటో పట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. వీటికి సంబంధించిన సరైన పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని లేనియెడల ఈ వాహనాలను సీజ్ చేయబడుతుందని వారు తెలిపారు. వాహనాలను కొందరు వ్యక్తులు దొంగతనంగా పట్టణాల నుంచి గాని వేరే రాష్ట్రాల నుంచి గాని తీసుకొచ్చి అమాయకమైన ప్రజలకు అమ్ముతుంటున్నారు. లేక వాటిని కుదవ పెదుతున్నారు వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని, సెకండ్ హ్యాండ్ వాహనాన్ని సరైన పత్రాలు ఉన్నాయా లేవని క్షుణ్ణంగా పరిశీలించి వాటిని కొనుగోలు చేయాలని వారి వద్ద నుంచి కొన్నట్టుగా అగ్రిమెంట్ రాయించుకోవాలని, త్వరగా నేమ్ ట్రాన్స్ఫర్ చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి ఎస్ఐ ఆలకుంట రాజేందర్,ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్, గుండాల సీఐ తిరుపతి, బోడు ఎస్సై పి. శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో భద్రాద్రి రామయ్య కల్యాణానికి ఇచ్చిన అనుమతులు రద్దు

- కల్యాణం పేరుతో వసూళ్లకు పాల్పడటంతో చర్యలు
- భద్రాద్రి దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు



**భద్రాచలం, జనవరి 22 ,ప్రజాజ్యోతి :** ఏపీ రాష్ట్రం విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించనున్న భద్రాద్రి రామయ్య కల్యాణం, శోభాయాత్రలకు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరపున ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు తెలిపారు.దేవాదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా వీవైశ్య సంస్థ వారు 'మంగళ సేవ' పేరుతో రూ. 11,116లు, 'అనుగ్రహ కల్యాణం' నిమిత్తం రూ.5,116లు చెల్లించాలని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న విషయం దేవస్థానం దృష్టికి వచ్చిందన్నారు.ఈ అంశంపై తగిన విచారణ జరిపిన అనంతరం, భద్రాద్రి రామాలయ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరించినందున ముందస్తు చర్యలలో భాగంగా వీవైశ్య సంస్థకు భద్రాద్రి రామయ్య కల్యాణం నిర్వహణకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్లు తెలిపారు. అలాగే వారు చెల్లించిన రూ.25,000లను అపరాధ రుసుముగా దేవస్థానం ఖాతాలో జమ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.ఇకపై భద్రాచలం శ్రీరాముడి పేరు, చిత్రాలను అనుమతి లేకుండా దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు. భద్రాద్రి రామయ్య మూలమూర్తులు, చిత్రాలపై పేటెంట్ హక్కులు దేవస్థానానికే ఉన్నాయని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడ్డ 40 మందికి జరిమానాతో పాటు సామాజిక శిక్ష

- మొక్కలు నాటించే కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి, పోలీసులు

**భద్రాచలం, జనవరి 22 ,ప్రజాజ్యోతి :** డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ వ్యక్తులకు జరిమానాతో పాటు సామాజిక శిక్ష విధిస్తూ భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి వి. శివనాయక్ గురువారం తీర్పు వెల్లడించారు. గురువారం డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడ్డ 40 మందిని భద్రాచలం పోలీసులు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వి. శివనాయక్ వారందరికీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో మద్యం సేవించి వాహనాలు నడిపితే మరింత కఠినమైన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు.అనంతరం వారికి జరిమానా విధించడంతో పాటు కోర్టు ఆవరణలో మొక్కలు నాటించే విధంగా సామాజిక శిక్షను ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి, పోలీసులు పాల్గొనగా, శిక్ష పొందిన వారు స్వయంగా మొక్కలు నాటారు.న్యాయమూర్తి విధించిన ఈ సామాజిక శిక్షను పర్యావరణవాదులు, పట్టణ ప్రజలు అభినందించారు. గతంలో కూడా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ వ్యక్తులకు ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాలను శుభ్రపరచాలని శిక్షలు విధించిన విషయం తెలిసిందే.

## బోరు విషయంలో ఘర్షణ .... ఇరు వర్గాలకు గాయాలు

**దమ్మపేట,జనవరి. 22(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం దురదపాడు గ్రామానికి చెందిన సున్నం కరుణకుమారి, సున్నం జయరాజు మధ్య వ్యవసాయ బోరు విషయంలో శుక్రవారం ఘర్షణ జరిగింది. ఇరు వర్గాలు ఒకరినొకరు గాయపరచుకున్నఘటనపై దమ్మపేట పోలీసుస్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. ఈ సంఘటనకు సంబంధించి ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించినట్లు దమ్మపేట ఎస్ఐ సాయి కిశోర్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదుల ఆధారంగా ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## అంబులెన్సు లో డెలివరీ



**చర్ల , జనవరి 22:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గురువారం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన జి . నందిని 22 సంవత్సరాలు పురిటి నొప్పులతో బాధపడు తూ ఉండగా కుటుంబ సభ్యులు చర్ల సిహెచ్ సి తరలించగా వైద్యులు పరీక్షిం చి మెరుగైన వైద్య చికిత్స కోసం భద్రాచలం ఏరియా హాస్పిటల్ కి పంపించారు .అంబులెన్స్ లో వెళుతుండగా మార్గమధ్యంలో ఎటపాక ప్రాంతంలో పురిటి నొప్పులు ఎక్కువ అవ్వటంతో అంబులెన్స్ లో ఉన్న ఈఎంటి శిరోమణి కాన్పు చేయగా తల్లి బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.ఇరువురిని అంబులెన్స్ పైలట్ మ ధు క్షేమంగా వారిని భద్రాచలం ఏరియా హాస్పటల్ కు తీసుకునివెళ్ళారు. క్షే మంగా భద్రాచలం ఏరియా హాస్పిటల్ కి తీసుకు వచ్చినందుకు అంబులెన్స్ పైలట్ మధుకి ఈఎంటి శిరోమణికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజా జ్యోతి క్యాలండర్ ను ఆవిష్కరించిన సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్

**బూర్గంపహాడ్ జనవరి 22 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాకలో స్థానిక సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో ప్రజా జ్యోతి దినపత్రిక ముందంజలో ఉందని అన్నారు. నిజాయితీగల వార్తలను ప్రచురిస్తూ ప్రజల్లో చైతన్యం తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు చంద్రశేఖర్, రఘు,మణికంఠ,చందు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన యువత వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, జనవరి 22 ,ప్రజాజ్యోతి :** నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.గురువారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో గిరిజన యువతకు గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఎలక్ట్రానిక్ హార్డ్వేర్, డ్రోన్ సర్వీస్ ఎలక్ట్రిషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ అందిస్తున్న కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా యువత ఇప్పటివరకు పొందిన శిక్షణను ప్రాక్టికల్ ద్వారా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, పై చదువుల కోసం లేదా ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఐటీడీఏ ద్వారా అందిస్తున్న వివిధ వృత్తి నైపుణ్య శిక్షణలను శ్రద్ధగా నేర్చుకుని ప్రైవేట్ రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. డ్రోన్ ఆపరేటర్, కంప్యూటర్ హార్డ్వేర్, ఎలక్ట్రానిక్స్, రిసెప్షనిస్ట్ అసోసియేట్ వంటి కోర్సులు పూర్తి చేసిన యువతకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు.డ్రోన్ సర్వీస్ శిక్షణ పొందిన యువతకు వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు చోటు చేసుకుంటున్నాయని, డ్రోన్‌ల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అనేక పనులు చేయవచ్చని వివరించారు. గెస్ట్ సర్వీస్ అసోసియేట్ శిక్షణ పొందుతున్న యువత సంస్థల్లో ఓపిక, సహనం కలిగి విధులు నిర్వర్తిస్తే ఎక్కడ పని చేసినా ఎదుగుతారని అన్నారు.ఎలక్ట్రానిక్ హార్డ్వేర్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్ శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు హైదరాబాద్‌లోని వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మూడు కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువత ప్రతిరోజూ ఇంగ్లీష్‌లో మాట్లాడే అలవాటు చేసుకుంటే శిక్షణ మరింత సులభంగా అవగాహనకు వస్తుందని సూచించారు.అనంతరం ఈ నెల 27న గిరిజన భవనంలో నిర్వహించనున్న సీఎస్ఆర్ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, వివిధ కోర్సుల శిక్షకులు శ్రీనివాస్, అరుణ, సులోచన, అబ్దుల్, భవాని, అనూహ్య, వినీత, సమ్మయ్యతో పాటు గిరిజన యువతీ, యువకులు పాల్గొన్నారు.

## భద్రాద్రి సాయిబాబా ఆలయానికి భారీ విరాళం

- శాశ్వత నిత్యాన్నదానానికి రూ.6.20 లక్షలు అందజేసిన ఎన్నారై దంపతులు



**భద్రాచలం, జనవరి 22 ,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి అమెరికాలో స్థిరపడ్డ ఎన్నారై దంపతులు వడ్లమూడి వినయ్ కుమార్, పొట్లూరి సింధులు రూ.6,20,000 విరాళంగా అందజేశారు.ఇదే కుటుంబానికి చెందిన పొట్లూరి వెంకటేశ్వర ప్రసాద్ గతంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.11 లక్షల విరాళాన్ని అందజేసిన విషయం తెలిసిందే.వీరు అందజేసిన విరాళాన్ని బ్యాంకులో జమ చేసి, దానిపై వచ్చే వడ్డీతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొమ్మనపల్లి ఆదినారాయణ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి గ్రామపంచాయతీ అండ

- కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ములకలపల్లి, జనవరి 22, ప్రజా జ్యోతి:** ఇటీవల మృతి చెందిన పాత గంగారం గ్రామపంచాయతీ కార్మికుడు మీడియం ముత్యాలు కుటుంబానికి పంచాయతీ ప్రజల తరపున 25 కేజీల బియ్యం, రూ.30,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నగదును స్థానిక సర్పంచ్ సోడే చైతన్య, గ్రామ పెద్దలు, అధికారులు సమక్షంలో బుధవారం ముత్యాలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోడే చైతన్య మాట్లాడుతూ గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న మీడియం ముత్యాలు అకాల మరణం చాలా బాధాకరమని అన్నారు. ముత్యాలు కుటుంబానికి తమ వంతు సహాయంగా పంచాయతీ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.30,000 విరాళాలు సమకూర్చి అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కణితి సత్యనారాయణ, ఎంపిఒ రమేష్ బాబు, పంచాయితీ కార్యదర్శి ఇస్లావత్ సునేష్, మాజీ సర్పంచ్ వాడే శేషగిరి, మడకం రమేష్, మడకం సురేష్, ఊకె నాగేంద్ర, సున్నం ప్రసాద్, చేప వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి : సర్పంచ్ కుంజా వినోద్

- జగన్నాధపురం జెడ్పీహెచ్ఎస్‌లో క్రీడా పోటీలు

**ములకలపల్లి, జనవరి 22, ప్రజా జ్యోతి :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జగన్నాధపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జగన్నాధపురం గ్రామ పంచాయితీ సర్పంచ్ కుంజా వినోద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్ అని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ విభాగాల్లో బాల బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జలగం మాధవి, పంచాయతీ సెక్రటరీ ఎస్.కె. ఇబ్రహీం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. వెంకట నర్సమ్మ, ఉపాధ్యాయులు భాస్కర్, వార్డు సభ్యులు జమిలి ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పామర్తి కృష్ణ, మరీదు నాగు, సి.హెచ్. రామాచారి, మీడియం నారాయణ, సోయం బోడప్ప తదితరులు పాల్గొన్నారు.



## దమ్మపేట పంచాయతీ సమావేశంలో కీలక తీర్మానాలు

- అభివృద్ధి పనులకు దమ్మపేట పంచాయతీ గ్రీన్ సిగ్నల్
- ఆక్రమణలు, అక్రమ షాపులపై పంచాయతీ కఠిన నిర్ణయాలు



**దమ్మపేట,జనవరి. 22 (ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పాలకవర్గ సభ్యుల సమావేశంలో పలు అభివృద్ధి, ప్రజాహిత తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.గ్రామంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా మంచి నీటి పైప్ లైన్ లీకేజీలను మరమ్మతులు చేయడం, గేట్ వాల్వుల నిర్వహణతో పాటు అవసరమైన చోట కొత్త పైప్ లైన్ లు వేయాలని నిర్ణయించారు. గ్రామంలోని మద్యం బెల్ట్ షాపులు తప్పనిసరిగా పంచాయతీ అనుమతి తీసుకోవాలని తీర్మానించారు.శిధిలావస్థలో ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త, పిచ్చిచెట్లు పెరగకుండా సంబంధిత యజమానులు శుభ్రం చేయించాలని, మంచి నీటి కుళాయిలకు నల్లాలు బిగించాలని, నీటిని వృథా చేసే వారి కుళాయిలను నిలిపివేయాలని నిర్ణయించారు.గ్రామంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, విననివారిపై జరిమానా విధించాలని తీర్మానించారు. ప్రధాన మెయిన్ రోడ్డుకు డ్రైనేజీ దాటి ఎటువంటి వ్యాపార సముదాయాలు, నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. అలాగే సిమెంట్ రోడ్లకు మూడు అడుగుల దూరం వరకు ఆక్రమణలు, నిర్మాణాలు నిషేధించారు.వీధి దీపాల నిర్వహణకు ఆటోమేటిక్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ఉన్న కరెంట్ స్థంభాల వద్ద ఫ్యూజ్ లు తొలగించాలని నిర్ణయించారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న కరెంట్ స్థంభాలు, క్రిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలని తీర్మానించారు.మురికి కాలువల్లో నీరు నిల్వ కాకుండా జంక్షన్ ప్రాంతాల్లో తూరలు ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, దేవాలయాల సమీపంలో ఉన్న మాంసం, మద్యం దుకాణాలను తొలగించాలని నిర్ణయించారు. పంచాయతీకి చెందిన సంతపాకల స్థలంలో టెండర్లు పిలిచి వ్యాపార సముదాయాలకు అవకాశం కల్పించాలని తెలిపారు.గ్రామంలో సిమెంట్ రోడ్లపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని, గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు షాదీఖానా పక్కన ఉన్న శిధిలావస్థ భవనాన్ని కూల్చాలని తీర్మానించారు. అవసరమైన చోట సిమెంట్ రోడ్ల నిర్మాణం, రోడ్ల మరమ్మతులు, రోడ్ల మార్జిన్ లకు గ్రావెల్ వేయడం, సిమెంట్ ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో సర్పంచ్ పగడాల రమాదేవి, పంచాయతీ సెక్రటరీ కళ్లెం సంజీవ రెడ్డి, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులతో ఘనంగా ప్రజాజ్యోతి క్యాలెండర్ ఆవిష్కరణ



**దమ్మపేట, జనవరి 22 (ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామ నూతన సర్పంచ్ పగడాల రమాదేవి–రాంబాబు, వార్డు మెంబర్స్ తో కలసి దమ్మపేట గ్రామ పంచాయతి కార్యాలయంలో ప్రజాజ్యోతి క్యాలెండర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. మందలపల్లి గ్రామ నూతన సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, పంచాయతి సెక్రటరీ గోపి కూడా తమ పంచాయతీ కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాజ్యోతి పత్రిక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల గొంతుకగా నిలుస్తోందని ప్రశంసించారు. సామాన్య ప్రజలకు నిత్యం ఉపయోగపడే సమాచారాన్ని అందించడంలో పత్రిక కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రజల హక్కులు, అభివృద్ధి అంశాలపై నిరంతరం పోరాడే పత్రికగా ప్రజాజ్యోతి ప్రత్యేక గుర్తింపు సంపాదించిందని అన్నారు.కార్యక్రమంలో దమ్మపేట మండల ప్రజాజ్యోతి రిపోర్టర్ బెల్లం కొండ రామారావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో వెలుగులు





- హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన జారే
- అదనపు తరగతి గదులు, టీచర్ క్వార్టర్లకు శంకుస్థాపన

**దమ్మపేట, జనవరి 22 (ప్రజాజ్యోతి)** :గిరిజన విద్యార్థుల సౌకర్యార్థం అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన అత్యాధునిక హైమాస్ట్ లైట్లను గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. చీకటి పడగానే పాఠశాల ప్రాంగణం వెలుగులతో నిండిపోవడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం లైట్లే కాకుండా ఐటీడీఏ నిధులతో పాఠశాల మౌలిక సదుపాయాలను కూడా మెరుగుపరుస్తున్నామని తెలియజేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజను నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలో ఉండి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా టీచర్ క్వార్టర్లను నిర్మిస్తామని ఆయన తెలిపారు.అలాగే చలిలో విద్యార్థుల చదువులో ఆటంకం రాకుండా ఐటీడీఏ ఆధ్వర్యంలో షట్టర్లను కూడా ఎమ్మెల్యే విద్యార్థినిలకు పంపిణీ చేశారు.పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు నాగమణి,ఇతర సిబ్బంది ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివశక్తి దండు సారయ్య ఆధ్వర్యంలో...

# సమ్మక్క- సారలమ్మ గద్దెల ప్రతిష్ట

- -కొత్త కాలనీలో మినీ మేడారం జాతరకు ఏర్పాట్లు
- -గద్దెలు, గుడి నిర్మాణం పూర్తి
- -21న సారలమ్మ గద్దె
- -22న సమ్మక్క గద్దెల ప్రతిష్ట
- -23న అమ్మవారి పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, భోనాలతో ఊరేగింపు
- -ఎత్తు బంగారం, మొక్కులు చెల్లింపులు
- -పనులను పర్యవేక్షిస్తున్న దండు సారయ్య
- -23 రాత్రి మహా అన్నదానం
- -భక్తులు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలంటున్న దండు సారయ్య



**ఇల్లందు, జనవరి 22, ప్రజాజ్యోతి:** నమ్మి కొలిచే వారి కోరికలు తీర్చే కొంగు బంగారంలా మొక్కే వనదేవతలను కొలవడం తెలంగాణ ప్రజల భక్తికి నిదర్శనం. మహా కుంభమేళాగా పేరుగాంచిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రసిద్ధి. ఇదే తరహాలో మినీ మేడారం జాతరగా ఇల్లందు పట్టణం 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) ఆధ్వర్యంలో సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రతిష్ట మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గత కొన్ని నెలల నుండి 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీలో సమ్మక్క సారలమ్మల గద్దెల ఏర్పాట్లతో పాటు గుడి నిర్మాణ పనులను శివశక్తి దండుసారయ్య (సారిక చౌదరి) దగ్గరుండి పర్యవేక్షిస్తూ సూచనలు సలహాలు ఇవ్వడంతో త్వరితగతిన పనులు పూర్తి అయ్యాయనేది ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఈనెల 21న సారలమ్మ గద్దె ప్రతిష్ట, 22న సమ్మక్క గద్దె ప్రతిష్టతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా 23న అమ్మవారి పసుపు, కుంకుమ, ఒడి బియ్యం బోనాలతో ఊరేగింపుతో పాటు ఎత్తు బంగారం, మొక్కులు చెల్లించే కార్యక్రమాలు ఉంటాయని, 23 సాయంత్రం ఏడు గంటల నుండి మహా అన్నదానం నిర్వహించనున్నట్లు శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) తెలిపారు. ఇల్లందు పట్టణ, మండలంతో పాటు ఇతర ప్రాంతాల నుండి ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై వనదేవతల తల్లుల దర్శనం చేసుకోని, మహా అన్నదానంలో భాగస్వాములు కావాలని శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) కోరారు. ఇల్లందు పట్టణ, మండల, 13వ వార్డు, ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీ సమ్మక్క సారలమ్మలను దండు సారయ్య వేడుకున్నారు.

### »» మినీ మేడారంలా ఏర్పాట్లు

ఇల్లందు పట్టణంలోని 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీలో శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) ఎంతో ఖర్చుతో మినీ మేడారం జాతర తరహాలో శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రతిష్ట చేయడం జరిగింది. ప్రజలు ఎల్లవేళలా వనదేవతల దర్శనం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైనా కానీ వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు ఏర్పాటు చేశారు. ప్రజలు, భక్తులు ప్రశాంతంగా శ్రీ సమ్మక్క–సారలమ్మ గద్దెలను దర్శించుకోని మొక్కులు చెల్లించుకోవాలని శివశక్తి, పూజారి దండు సారయ్య (సారిక చౌదరి) కోరారు.

### »» 23న ముఖ్య అతిథులు హాజరు

పట్టణంలోని 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనీలో శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రతిష్టకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, డి 2 విన్నర్ జాను రిలీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ లతో పాటు ఇల్లందు పుర ప్రముఖులు హాజరుకానున్నట్లు దండు సారయ్య తెలిపారు. పట్టణ, మండల, వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.





## పాత్రికేయుడు బషీర్ పరామర్శించిన తాటి



**ములకలపల్లి, జనవరి 22, ప్రజాజ్యోతి :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలువిరిగి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ములకలపల్లి మండల ప్రజాజ్యోతి దినపత్రిక పాత్రికేయుడు షేక్ బషీర్ ను అశ్వారావుపేట, బూర్గంపహాడ్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ట్రైకర్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు పరామర్శించి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బషీర్ త్వరగా కోలుకొని ప్రజలకు అవసరమైన వార్తలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు జబ్బర్, ముత్తయ్య, జలపాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అక్షరయజ్ఞంలో ప్రజాజ్యోతి వెలుగులు నింపాలి

- నిష్పక్షపాత వార్తలకు నిలువుటద్దంలా ప్రజాజ్యోతి.... మాజీ ట్రైకర్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే తాటి



**ములకలపల్లి, జనవరి22, ప్రజాజ్యోతి:** నిరంతరం నిష్పక్షపాత వార్తలకు నిలువుటద్దంలా మారి, అక్షర యజ్ఞంలో ప్రజాజ్యోతి వెలుగులు నింపాలని బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు మాజీ ట్రైకర్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ప్రజాజ్యోతి దినపత్రిక రూపొందించిన క్యాలెండర్ ను స్థానిక అనుచరులు,నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందిన నిరంతరం వార్తా పత్రికల కోసం ఎదురుచూసే వారు ఎందరో ఉన్నారని మంచి వార్తలను అందిస్తూ ప్రజాజ్యోతి దినపత్రిక ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్స్ సభ్యులు జబ్బర్, ముత్తయ్య, జలపాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో గంజాయి పట్టివేత

**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 22: ప్రజా జ్యోతి:** అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని గురువారం రాత్రి పాల్వంచ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం, సీలేరు నుండి చెన్నైకు బస్సు ద్వారా రవాణా చేస్తున్న 40 కేజీల నిషేధిత గంజాయిని తరలిస్తున్న సమాచారం అందుకున్న పాల్వంచ పోలీసులు కాపుకాసి నలుగురిని అదుపులో తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది ,గంజాయి విలువ సుమారు 20 లక్షల వరకు ఉంటుందని అంచనా , పట్టుబడిన వారిలో నలుగురు మహిళలు ఒక మగ వ్యక్తి ఉన్నట్లు సమాచారం, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చెత్త సేకరణ పనులు చేపట్టండి

– వర్తక సంఘం అధ్యక్షులు సురేష్



**పినపాక,జనవరి 22(ప్రజాజ్యోతి ):** పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో చెత్తాచెదారం పేరుకొనిపోయి రోడ్డుకు ఇరువైపులా ఉందని వాటిని వెంటనే పంచాయతీ సిబ్బంది తొలగించే కార్యక్రమం చేపట్టాలని వర్తక సంఘం అధ్యక్షులు సురేష్ కోరారు. గురువారం పిరపాక మండలం ఈ బయ్యారం గ్రామపంచాయతీ సర్పంచ్ వాగబోయిన చంద్రరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈనెల 10వ తేదీ నుండి ఇంతవరకు చెత్త సేకరణ ట్రాక్టర్ ఈ బయ్యారం క్రాస్ రోడ్ కి రాలేదని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. రోడ్డు ఇరువైపులా వాటర్ బాటిల్స్ సైతం విపరీతంగా ఉంటున్నాయని సందర్భంగా వారు తెలిపారు. గతంలో మేడారం సందర్భంగా ఎంపీవో వెంకటేశ్వరరావు ఇతర అధికారులు, సెక్రటరీలు డ్రైనేజీ వరకు ఎటువంటి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకున్నారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రోడ్డు కు డ్రైనేజీ వరకు ఉన్న ఇరువైపులా ఆక్రమిత దుకాణాలు సైతం తొలగించడానికి అధికారులకు వర్తక సంఘం సహాయ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వి రెడ్డి, మురళి,లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.




## అప్పుడు వాళ్లు... ఇప్పుడు వీళ్లు...

# లూటీ కోసం పోటీ

- నైనీ గని టెండర్ తో మళ్లీ తెరపైకి వచ్చిన సింగరేణి లూటీ చర్చ..
- ప్రభుత్వాలు మారినా లూటీ ఆట మారలేదన్న ఆరోపణలు
- అవకాశాల గనిగా చెప్పిన నైనీ.. ఇప్పుడు వివాదాల గనిగా మారిందా..?
- సైట్ విజిట్ సర్టిఫికేట్ తో మొదలైన టెండర్ గందరగోళం
- వాటా లెక్కలు తేలకే.. బిడ్ ముందే రాజకీయాలు గడవలు అని ఆరోపణలు ?
- రూ.665 కోట్లు ఖర్చయినా ఇంకా మొదలుకాని గని..
- బీఆర్ ఎస్ హయాంలో ధర పెంపు ఆరోపణలు.. ఇప్పడు కొత్త అనుమానాలు
- ఓబీ కాంట్రాక్టుల చుట్టూ రింగులా వ్యవహారం అన్న చర్చ..
- ప్రధానంగా సొద సంస్థ అధినేత సృజన్ రెడ్డి పాత్ర పై ఆరోపణలు..?
- నైని సింగరేణికి కల్పతరువా..? లేక నేతలకు లూటీ వేదికా..?

**సింగరేణి ప్రతినిధి, జనవరి 22, ప్రజాజ్యోతి :** సింగరేణి ఒక స్వతంత్ర ప్రభుత్వ రంగ సంస్థ. రోజూ బొగ్గు తవ్వకాలు, రవాణా, అప్పుడప్పుడు ప్రమాదాలు, ఎల్లవేళలా కార్మికుల సంక్షేమం, కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తూ కళకళలాడుతున్న సంస్థ. బ్రిటిష్ పాలనలో మొదలైన ఈ ప్రయాణం, నిజాం కాలం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనా దాటి ప్రత్యేక తెలంగాణ వరకు 125 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ సాగింది. ఇక తను పుట్టిన నేలకు స్వరాష్ట్రం సంకల్పించాడంతో ఇకపై తన ప్రస్థానానికి తిరుగులేదని మురిసి పోయింది. కాని తనకి తెలియదు ఇక్కడున్న నాయకులు లూటిల పోటితో శతాబ్దాల సిరుల మాగాణి చరిత్రను సమసిపోయేలా చేస్తారని ఊహించలేదు. ఎప్పుడు లేని విధంగా సింగరేణి గత 12 యేళ్ళుగా విపరీతమైన ఎదురుదెబ్బలు ఎదుర్కుంటోంది. అవి డిసిల్ కుంభకోణమైనా, మెడికల్ మాఫియ అయినా, లేదా ఇప్పుడు వినబడుతున్న ఓబి కాంట్రాక్ట్ పనుల కేటాయింపు అయినా. దీంతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఇచ్చే గనిగా భావిస్తున్ననైనీ, సింగరేణికి అవకాశాల గనిగా నిలుస్తుందా లేక వివాదాల గనిగా మారుతుందా అన్నదే కార్మికుల మదిలో మెదులుతోంది.

### »» అసలు నైనీ వివాదాస్పదమా..?

నైనీ.. బొగ్గు బ్లాక్ పేరు వినగానే ఇప్పుడు వివాదమే గుర్తుకు వస్తోంది. రాజకీయ ఆరోపణలు, మీడియా కథనాలు, అధికారుల ప్రతిస్పందనలు.. ఇవన్నీ కలిసి నైనీని ఒక వివాదాస్పద గనిగా మార్చేశాయి. కానీ కోల్ బెల్ట్ వర్గాల్లో, కోల్ ఇండియా స్థాయిలో ఈ గని గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. దీంతో నైనీ నిజంగా సమస్యల గనినా..? లేక సింగరేణికి భవిష్యత్తులో కల్పతరువులా మారే అవకాశాల గనినా..? ఈ ప్రశ్నకు సమాధానం నైనీ చుట్టూ జరిగిన పరిణామాలను వరుసగా చూస్తే స్పష్టమవుతుంది. ఒడిశా రాష్ట్రం అంగుల్ జిల్లా పరిధిలోని తాల్చేర్ బొగ్గు క్షేత్రాల్లో ఉన్న నైని బొగ్గు బ్లాక్, సింగరేణి భవిష్యత్తుకు కీలకమైన ప్రాజెక్ట్. దేశంలోనే ప్రధాన బొగ్గు క్షేత్రాలుగా పేరున్న తాల్చేర్ ప్రాంతంలో ఉన్న ఈ గనిని కేంద్ర ప్రభుత్వం 2015లోనే ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి నేరుగా కేటాయించడం విశేషంగా చెప్పుకుంటున్నారు. వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి ఈ బ్లాక్ అప్పగించడంతో, జాతీయ బొగ్గు భద్రతలో సింగరేణి పాత్ర మరింత బలోపేతం అవుతుందని గనుల వర్గాలు అప్పట్లో భావించాయి. ఈ నైని బొగ్గు బ్లాక్ ప్రత్యేకత దాని భౌగోళిక స్వభావమే. ఇక్కడ భారీ స్థాయిలో బొగ్గు నిల్వలు ఉన్నట్టు అంచనాలు ఉన్నాయి. ఓపెన్ కాస్ట్ మైనింగ్ కు అనుకూలమైన పరిస్థితులు ఉండటంతో తవ్వకాలకు అయ్యే ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని మైనింగ్ అధికారులు చెబుతున్నారు. అలాగే రైల్వే మార్గాలు, విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమల మౌలిక సదుపాయాలకు సమీపంలో ఉండటం ఈ గనికి మరో అదనపు బలం కూడా. అయితే ఈ గనిని సింగరేణికి నేరుగా అప్పగించడానికి ఓ బలమైన కారణం కూడా ఉంది. ఇప్పటివరకు సంస్థ పరిధిలో ఉన్న తెలంగాణలోని పాత గనులు క్రమంగా లోతుగా మారుతున్న నేపథ్యంలో, ఇక్కడ ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నైని లాంటి గని అయితే తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి సాధించే అవకాశాన్ని సింగరేణికి కల్పిస్తుందని కేంద్రం ఆలోచించింది. అందుకే నైని బొగ్గు బ్లాక్ ను కేవలం మరో గనిగా కాకుండా, సింగరేణికి దీర్ఘకాలిక బొగ్గు భద్రతను అందించే వ్యూహాత్మక ఆస్తిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

### »» ఇప్పటి వరకు 665 కోట్లు..

అయితే కేటాయింపు జరిగినప్పటి నుంచే నైనీ గని అభివృద్ధి సాఫీగా సాగలేదు. భూసేకరణ, అటవీ అనుమతులు, పర్యావరణ క్లియరెన్సులు వంటి కారణాలతో తవ్వకాలు సంవత్సరాల పాటు ఆలస్యమయ్యాయి. ఈ మధ్యకాలంలో సింగరేణి నైనీ గనిపై రోడ్లు, సర్వేలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక అధ్యయనాల పేరుతో సుమారు రూ.665 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు గనుల వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ ఇప్పటివరకు పూర్తి స్థాయి బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదు. దీంతో “సంవత్సరాలు గడిచాయి.. డబ్బులు ఖర్చయ్యాయి.. గని మాత్రం ఇంకా మొదలుకాలేదు” అన్న అసంతృప్తి కోల్ బెల్ట్ ప్రాంతాల్లో పెరిగింది. ఈ ఆలస్యం నేపథ్యంలో పూర్తి స్థాయి తవ్వకాలకు ముందుగా ఓవర్ బర్డన్ తొలగింపు పనులు చేపట్టాలని సింగరేణి నిర్ణయించింది. దీర్ఘకాలిక టెండర్ కు వెళ్లకుండా, ఒకటి నుంచి రెండు సంవత్సరాల కాలానికి షార్ట్ టెర్మ్ టెండర్ ను తెచ్చింది. భవిష్యత్తులో తవ్వకాలు సులభం కావడానికి గనిని సిద్ధం చేయడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. కానీ వివాదం అసలు మొదలైంది దీర్ఘకాలిక టెండర్ దశలో కొత్తగా తీసుకొచ్చిన ఒక నిబంధనతో. అదే “సైట్ విజిట్ సర్టిఫికేట్”.

### »» “సైట్ విజిట్ సర్టిఫికేట్” ఖచ్చితమా ..?

సాధారణంగా బొగ్గు గనుల టెండర్లలో పాల్గొనే సంస్థలు గనుల ప్రాంతాన్ని చూసి రావాలి. కానీ ఇప్పటివరకు దేశంలోని ఏ బొగ్గు సంస్థలోనూ “సైట్ చూసినట్టు అధికారులిచ్చే ప్రత్యేక సర్టిఫికేట్ తప్పనిసరి, అది లేకపోతే బిడ్ వేయకూడదు” అన్న నిబంధన లేదు. కంపెనీలు తామే సైట్ చూసినట్టు డిక్లరేషన్ ఇస్తాయి. అంతే. కానీ నైనీ బ్లాక్ టెండర్ లో మాత్రం ఈ విధానం పూర్తిగా మారింది. సైట్ విజిట్ చేయడమే కాకుండా, అధికారులిచ్చే సైట్ విజిట్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన పెట్టారు. ఈ నిబంధనను ముందుగా సింగరేణి తెలంగాణలోని కొన్ని గనుల్లో ప్రయోగంగా అమలు చేశారు. అక్కడ పెద్దగా అభ్యంతరాలు రాకపోవడంతో, అదే విధానాన్ని నైనీకి వర్తింపజేశారు. కానీ నైనీ గని ఓబీ కాంట్రాక్టర్లకు భారీ లాభాలు ఇచ్చే గనిగా అంచనా ఉండటంతో, ఇక్కడ రాజకీయ ఆసక్తి ఒక్కసారిగా పెరిగింది. అయితే సైట్ విజిట్ సర్టిఫికేట్ ఎవరికివ్వాలి? ఎప్పుడు ఇవ్వాలి? ఒకే సమయంలో అందరికీ ఎందుకు ఇవ్వకూడదు? అన్న అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో, నిబంధన చట్టబద్ధమైనదైనా అమలులో వివాదంగా మారింది. టెండర్ ఇంకా తొలి దశలోనే ఉన్నా, బిడ్లు తెరవకముందే రాజకీయ ఆరోపణలు, మీడియా యుద్ధాలు మొదలవడం చూస్తే, “ఎవరికెంత వాటా” అన్న లెక్కలు ముందే వేసుకున్నట్టే కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### »» స్వరాష్ట్రంలోనే దోచుకుంటున్నారు..?

తెలంగాణ ఏర్పడిన తరువాత, “ఇక స్వరాష్ట్రంలో సింగరేణి ప్రస్థానానికి తిరుగులేదు” అన్న ఆశ సంస్థలోనూ, కార్మికుల్లోనూ బలంగా నాటుకుంది. కానీ ఈ 12 ఏళ్లలో ఆ ఆశ ఎక్కువ కాలం నిలవలేదన్న భావన ఇప్పుడు కోల్ బెల్ట్ లో వినిపిస్తోంది. ఎందుకంటే రాష్ట్రం మారిన తర్వాత, రెండో ప్రభుత్వమాధికారంలోకి వచ్చినా సింగరేణి చుట్టూ తిరిగే రాజకీయ ఆకలి మాత్రం మారలేదన్న అభిప్రాయం బలపడుతోంది. ఒకప్పుడు బీఆర్ ఎస్ ప్రభుత్వ కాలంలో వినిపించిన లూటీ ఆరోపణలే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ తిరిగి వినిపించడంతో “అప్పుడు వాళ్లు... ఇప్పుడు వీళ్లు..” అన్న పోలికలు సహజంగా తెరపైకి వస్తున్నాయి.

### »» అప్పుడు బీఆర్ ఎస్ వాళ్లు దోచుకుందామనే..

ప్రత్యేకంగా నైనీ బొగ్గు గని విషయంలో ఏ ప్రభుత్వమైనా దోచుకుందామనే ధోరణితోనే ముందుకు సాగినట్టుగా కోల్ బెల్ట్ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ ఎస్) ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందన్న ఆరోపణలు తరచూ వినిపించేవి. కాంట్రాక్టులు, పోస్టింగులు, గనుల అభివృద్ధి, సరఫరా ఒప్పందాలు వంటి ప్రతి అంశంలోనూ రాజకీయ ప్రభావం ఉందన్న విమర్శలు అప్పట్లో గట్టిగా వచ్చాయి. అయితే బీఆర్ ఎస్ హయాంలోనే నైనీ గనిలో బొగ్గు తవ్వకాలకు టెండర్లను కూడా పిలిచారు. ఈ టెండర్ ప్రక్రియలో సంస్థ ప్రతి టన్ను బొగ్గు వెలికితీతకు రూ.625గా ధర నిర్ణయించి ముందుకు వెళ్లింది. అయితే ఆ దశలోనే కొందరు రాజకీయ – కాంట్రాక్టర్ వర్గాలు రింగుగా ఏర్పడి ఈ ధరను భారీగా పెంచే ప్రయత్నం చేసినట్టుగా అప్పట్లో ప్రచారం జరిగింది. ధరను సుమారు 45 శాతం ప్లస్ కు పెంచాలని సిండికేట్ అయిందన్న ఆరోపణలు వినిపించాయి. ఈ లెక్కన టన్నుకు సుమారు రూ.910 వరకు ధర వెళ్లే అవకాశం ఉందని కోల్ బెల్ట్ లో చర్చ జరిగింది. ఇంకా ఆపై దశలో ఈ ధరను రూ.1200 వరకు తీసుకెళ్లే ఆలోచన కూడా ఉన్నట్టుగా అప్పట్లో కోడై కూసింది. దాంతో పాటు బీఆర్ ఎస్ హయాంలో సంస్థలో అవకతవకలు, అవినీతి ఆరోపణలు బయటకు వచ్చినా వ్యవస్థలో గణనీయమైన మార్పు రాలేదన్న అసంతృప్తి కూడా కార్మికుల్లో బలంగా ఉండేది. ప్రభుత్వం మారితే పరిస్థితి మారుతుందన్న ఆశతోనే కాంగ్రెస్ కు అవకాశం ఇచ్చారన్న మాట కోల్ బెల్ట్ ప్రాంతాల్లో వినిపించింది.

### ఇక కాంగ్రెస్ వంతు..

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సింగరేణి చుట్టూ అదే తరహా కథ మొదలైందన్న భావన ఇప్పుడు బలపడుతోంది. దీనికి తాజా ఉదాహరణగా ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ వివాదాన్ని కోల్ బెల్ట్ వర్గాలు చూపిస్తున్నాయి. ప్రభుత్వం మారితే పాలనా ధోరణి మారుతుందన్న ఆశ ఉన్నా, నైనీ విషయంలో మాత్రం పాత అనుమానాలే కొత్త పేర్లతో వినిపిస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓబీ కాంట్రాక్ట్ కేటాయింపు, సైట్ విజిట్ సర్టిఫికేట్ అనే కొత్త నిబంధన, టెండర్ ఇంకా తొలి దశలోనే ఉండగానే మొదలైన రాజకీయ ఆరోపణలు – ఇవన్నీ కలసి కాంగ్రెస్ హయాంలోనూ సింగరేణి చుట్టూ కాంట్రాక్ట్ రాజకీయాలు మితిమీరి పోయాయా..? అన్న ప్రశ్నను తెరపైకి తెచ్చాయి. ఇప్పటివరకు పరిపాలనా నిర్ణయాలుగా కనిపించిన అంశాలు క్రమంగా రాజకీయ చర్చలుగా మారడంతో, “ప్రభుత్వాలు మారినా విధానం మారలేదా?” అన్న సందేహం కార్మికుల్లోనూ, గనుల వర్గాల్లోనూ పెరుగుతోంది. అయితే ఈ సర్టిఫికేట్ అంశాలన్నీ సింగరేణి యాజమాన్య నిర్ణయమేనని పైకి చెబుతున్న.. అసలు వాస్తవం మాత్రం వేరేలా ఉంది. ఈ నిభందనను బూచిగా చూపిస్తూ.. ప్రభుత్వ పెద్దలకు మేలు చేస్తున్నరన్నది ప్రధాన వాదనగా ఉంది. ఈ నేపథ్యంలో సింగరేణిని దోచుకోవడం ఇక మా వంతు అన్నట్టుగా కాంగ్రెస్ అధిష్టానం వ్యవహరిస్తోందన్న చర్చ కార్మిక వాడల్లో సాగుతోంది. గత బీఆర్ ఎస్ హయాంలో మొదలైన అనుమానాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనూ కొనసాగుతున్నాయన్న భావనే కోల్ బెల్ట్ ప్రాంతాల్లో బలంగా వినిపిస్తోంది. అందుకే “అప్పుడు వాళ్లు... ఇప్పుడు వీళ్లు...” అన్న పోలికలు సహజంగా వస్తున్నాయి. అయితే నైనీ గని సింగరేణికి నిజంగా అవకాశాల గనిగా మారాలంటే, టెండర్ ప్రక్రియల్లో స్పష్టత, సమాన అవకాశాలు, పారదర్శక నిర్ణయాలే కీలకమని కార్మిక సంఘాలు, గనుల నిపుణులు చెబుతున్నారు.

## సృజన్ రెడ్డి పాత్రపై సందేహాలు..

ఈ మొత్తం వ్యవహారంలో కోల్ బెల్ట్ ప్రాంతాల్లో మరో చర్చ బలంగా వినిపిస్తోంది. అదే సొధ సంస్థ అధినేత కాంట్రాక్టర్ సృజన్ రెడ్డి పాత్ర. వాస్తవానికి ఆయన ఇరిగేషన్ విభాగంలోనే కాంట్రాక్టర్ గా పేరు తెచ్చుకున్న వ్యక్తిగా గుర్తింపు ఉంది. కానీ సింగరేణి గనుల వ్యవహారాల్లో ఆయన పేరు ఎప్పటి నుంచి వినిపిస్తోంది? టీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనూ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడూ ఒకే రీతిలో ఆయన పేరు చర్చకు రావడం సహజమేనా? అన్న ప్రశ్నలు అధికార వర్గాల్లోనూ, కార్మిక సంఘాల్లోనూ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మాజీ మంత్రి హరీష్ రావు, అలాగే కేటీఆర్ బహిరంగంగా సృజన్ రెడ్డి పేరును ప్రస్తావించడంతో ఆయన పేరు మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే ఇరిగేషన్ కాంట్రాక్టర్ గా మొదలైన ఈ ప్రయాణం సింగరేణి టెండర్ల వరకూ ఎలా చేరింది? సింగరేణిలో ఆయన ప్రవేశం ఎప్పటినుంచి మొదలైంది? టీఆర్ఎస్ హయాంలోనూ, కాంగ్రెస్ హయాంలోనూ ఆయన ఎందుకు కీలకంగా మారుతున్నారన్నది ఇంకా స్పష్టంగా తేలాల్సిన అంశమే. కొంతమంది వర్గాలు చెబుతున్నట్టుగా సృజన్ రెడ్డి కారణంగా సింగరేణి అధికారులపై ఒత్తిళ్లు పెరిగాయా..? టెండర్లలో రింగు మాస్టర్ పాత్ర ఇప్పటికీ అతనిదే అన్న ఆరోపణలకు ఆధారాలేమైనా ఉన్నాయా..? అన్నది విచారణకు, స్పష్టతకు నోచుకోవాల్సిన అంశాలుగా మిగిలాయి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వాలు మారినా, పేర్లు మారినా, సింగరేణి చుట్టూ తిరిగే కాంట్రాక్ట్ రాజకీయాలు మాత్రం మారలేదన్న భావన కోల్ బెల్ట్ ప్రాంతాల్లో బలపడుతోంది.